# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నంచడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 42 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 16 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :42 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 16 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## హర్మూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు



హర్మూజ్ జలసంధిలో ఓ కార్గో నౌక ( మునిగిపోయింది. సీమైన్‌ను ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసు కున్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వెల్లడించింది. అయితే, మైన్‌ను ఢీకొట్టి నౌక మునిగిపోయినట్లుగా ఐఆర్‌జీసీ ప్రకటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

- మిగతా 2లో





## కుప్పకూలిన పాఠశాల పైకప్పు.. 34 మంది విద్యార్థులు మృతి

పాకిస్థాన్ లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు పాఠశాల పైకప్పు కూలి 34 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు 13 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులే కావడం విషాదకరం. పెషావర్ లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది

- మిగతా 2లో

## భారత్ వైర్‌లెస్ డేటాలో 60 శాతం మాదే

- అక్టోబర్ 21 నుంచి 23 వరకు జియో ప్లాట్‌ఫామ్స్ మెగా ఐపీఓ
- కంపెనీకి 53.3 కోట్ల మంది కస్టమర్లు, అందులో 28.5 కోట్ల మంది 5జీ యూజర్లు
- రూ.30,213 కోట్లు సమీకరించడమే లక్ష్యంగా ఐపీఓ ఇష్యూ
- భారత్‌ను అతిపెద్ద డిజిటల్ సొసైటీగా మార్చడమే లక్ష్యమన్న జియో



- మిగతా 2లో

## సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా..

# ఇదే మా విధానం

- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు
- గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక
- ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయమని స్పష్టీకరణ



మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.



- మిగతా 2లో



## మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు..

### మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల

- మేయర్లు, ఛైర్మన్ల పూర్తి జాబితాను విడుదల చేసిన వైసీపీ అధిష్ఠానం
- వైఎస్ జగన్ ఆమోదంతో తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన
- జాబితాలో మహిళలు, బీసీ, ఎస్సీ వర్గాలకు గణనీయమైన ప్రాధాన్యం
- 7 కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు అభ్యర్థుల పేర్లు వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమరానికి వైసీపీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం అధికారికంగా పత్రికా ప్రకటన ద్వారా అభ్యర్థుల పూర్తి జాబితాను విడుదల చేసింది.

- మిగతా 2లో



## విచ్ఛిన్నకర శక్తులతో జగన్ చేతులు కలిపారు

అమరావతి: కేసులు ఎదుర్కొంటున్న జగన్‌తో చేతులు కలపడం ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ అజెండా ఏంటో స్పష్టమైందని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఎద్దేవా చేశారు. "నాడు ఆలయాల ఆస్తుల ఆక్రమణ, మత మార్పిడులను

- మిగతా 2లో

## సీట్ల సర్దుబాటు అంశం.. చంద్రబాబుతో మంత్రుల చర్చలు

ఉండవల్లి: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యంగా పోటీ చేయాలని నిర్ణయించిన కూటమి నేతలు.. ఎవరు, ఎక్కడ బరిలోకి దిగాలన్న అంశంపై



- మిగతా 2లో

## విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

- శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తుడు దుర్గా శ్రీనివాస్ సమర్పణ
- 494 గ్రాముల బంగారంతో నవరత్నాలతో కిరీటం తయారీ
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఈ కానుక అందజేత



- మిగతా 2లో

## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు..

# 12 కొత్త హాల్టులు

- దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం
- ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం
- మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు



- మిగతా 2లో




## నారాయణపేటలో దారుణం

### పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య

- వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను హత్య చేసిన భార్య
- నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో జరిగిన దారుణ ఘటన
- నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి దాడి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి
- నేరం అంగీకరించిన నిందితురాలు.. కేసు నమోదు చేసిన పోలీసులు

- మిగతా 2లో

## సీఈసీని రక్షించేందుకే ఇదంతా

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం



- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని సీజేపీ ఆరోపణ
- ఎన్నికల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని అభిజిత్ దీప్కే విమర్శ
- ప్రభుత్వానిది 'ఒకే దేశం, ఒకే పార్టీ' నినాదమని విమర్శలు
- నటుడు ప్రకాశ్ రాజ్, ఇతర నేతలతో కలిసి దీప్కే మీడియా సమావేశం

- మిగతా 2లో




# వ్యూహం ఉత్తుత్తిదేనా.. మళ్లీ సేనలో అదే రిపీట్ అవుతుందట

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు నాయకత్వాన్ని పెంపొందించుకు నే పనిలో కన్నా టీడీపీ నేతలకు కండువాలు కప్పడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా జనసేన పార్టీలోకి టీడీపీ నేత వంగవీటి రాధాకృష్ణ చేరారు. పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన వంగవీటి రాధాకృష్ణను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కండువా కప్పి పవన్ కల్యాణ్ వంగవీటి రాధా కృష్ణను జనసేన పార్టీలోకి పవన్ ఆహ్వానించారు. వంగవీటి రాధాకృష్ణతో పాటు జనసేన పార్టీలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కు చేరారు. జనసేన నుంచి విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరు వినిపిస్తుండటంతో ఆయన జనసేనలో చేరడం చర్చనీయాంశంగా మారింది. అలాగే తిరుపతి మేయర్ అభ్యర్థిగా ప్రణీత్ ప్రమోద్ పేరు కూడా వినిపిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ పవన్ కల్యాణ్ ఇదే రకమైన వ్యూహాన్ని అనుసరించారు. తిరిగి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే స్ట్రాటజీనా? అంటూ జనసైనికులే పెదవి విరుస్తున్నారు.

**పలు దఫాలు చర్చలు జరిపినా...**

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీలైన టీడీపీ, జనసేనల మధ్య సీట్ల సర్దుబాటు మరియు రాజకీయ వ్యూహాలపై విస్తృత చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన విజయవంతమైన పొత్తు ఫార్ములానే ఇక్కడ కూడా కొనసాగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతిలో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. ఈ చర్చల్లో భాగంగా జనసేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆరు కార్పొరేషన్లలో మేయర్ పదవి, అలాగే 26 మున్సిపాలిటీలను తమకు కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. గత ఎన్నికలకు ముందు కూడా ఎమ్మెల్యే అభ్యర్థులను టీడీపీ నుంచి వైసీపీ నుంచి పార్టీలోకి చేర్చుకుని వారికి టిక్కెట్లు ఇవ్వడంతో ఇప్పుడు అసలైన జనసేన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందన్న భావన వ్యక్తమవుతుంది.

**అత్యధిక మంది టీడీపీ వారే...**

జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇంత మంది ఉన్నా వారిలో అత్యధిక మంది టీడీపీకి చెందిన వారేనని, ఇక చంద్రబాబు తాను సీట్లు ఇవ్వలేని వారిని జనసేనలోకి పంపి అక్కడ సీట్లు దక్కేలా చేస్తున్నారని జనసేన నేతలు సోషల్ మీడియాలో వాపోతున్నారు. దీనివల్ల వాస్తవంగా పార్టీ కోసం నిబద్ధతగా పనిచేసిన నేతలకు అన్యాయం జరుగుతుందని, ఇదే స్ట్రాటజీని తిరిగి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అనుసరించడంపైన కూడా కొంత వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అయితే గెలుపు గుర్రాలనే ఎంపిక చేస్తున్నామని జనసేన నాయకత్వం చెప్పుకుంటుంది. గెలుపు గుర్రాల ఎంపిక, కొన్ని స్థానాల్లో స్థానిక సమీకరణాల దృష్ట్యా సమర్థులైన నేతలను బరిలోకి దించేందుకు ఇరు పార్టీల మధ్య సమన్వయ కమిటీలు కూడా పనిచేయనున్నాయి. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే సమర్థత ఆధారంగా సీట్ల కేటాయింపు జరగవచ్చని తెలుస్తోంది. ఈ స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు వ్యవహారం లో అగ్రనేతలు కలసి ఉన్నట్లు చేతులు కలిపినా కింది స్థాయిలో ఓట్ల బదిలీ అనేది జరగకపోవచ్చన్న అభిప్రాయం బలంగా వినపడుతుంది.

## భారత్ వైర్‌లెస్ డేటాలో 60 శాతం మాదే

రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ తన మెగా ఐపీఓకు రంగం సిద్ధం చేసింది. ఈ నెల అక్టోబర్ 21 నుంచి 23 వరకు ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ సందర్భంగా ముంబైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ, జియో సాధించిన ప్రగతిని, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. దేశవ్యాప్త వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో 60 శాతానికి పైగా వాటాను జియో నెట్‌వర్క్ దక్కించుకుందని ఆయన వెల్లడించారు. 2026 జూన్ 30 నాటికి జియో వినియోగదారుల సంఖ్య 53.3 కోట్లకు చేరిందని, వీరిలో 28.5 కోట్ల మంది 5జీ వినియోగదారులేనని ఆకాశ్ అంబానీ తెలిపారు. చైనా మినహా ప్రపంచంలోనే ఇంతటి భారీ కస్టమర్ బేస్ కలిగిన ఏకైక సంస్థగా జియో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఒక్కో వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వినియోగం 43.7 జీబీకి పెరిగిందని, ఇది దేశంలో మారుతున్న డిజిటల్ అవసరాలకు నిదర్శనమని వివరించారు. 2016లో జియో సేవలు ప్రారంభమైన సమయంలో దేశంలో సగటు ఇంటర్నెట్ డౌన్‌లోడ్ వేగం కేవలం 2.5 ఎంబీపీఎస్‌గా ఉండగా, ఇప్పుడు అది 68 ఎంబీపీఎస్‌కి పెరిగిందని ఆయన గుర్తుచేశారు. జియో 5జీ సగటు డౌన్‌లోడ్ స్పీడ్ 198.9 ఎంబీపీఎస్‌గా నమోదైందని పేర్కొన్నారు. సరసమైన ధరలకే డేటా లభిస్తుండటంతో ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్, డిజిటల్ చెల్లింపులు వంటి సేవలు గణనీయంగా విస్తరించాయని ఆయన అభిప్రాయపడ్డారు. కంపెనీ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని వివరిస్తూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,60,537 టవర్లు, 26,800 వీఎఓ స్పెక్ట్రమ్‌తో సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నిర్వహణ లాభం 17.8 శాతం వృద్ధితో రూ. 76,225 కోట్లుగా నమోదైందని తెలిపారు. అలాగే, జియో హోమ్ బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల సంఖ్య కూడా 2.8 కోట్లకు చేరుకుందని వివరించారు. భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ సమాజంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని ఆకాశ్ అంబానీ పునరుద్ఘాటించారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన నెట్‌వర్క్ సాఫ్ట్‌వేర్, పరికరాలను అంతర్జాతీయ ఆపరేటర్లకు విక్రయించే దిశగా యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. 2031 నాటికి భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ 1.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామని, అందులో ప్రధాన వాటాను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఐపీఓ ద్వారా ఒక్కో షేరుకు రూ. 1,065 నుంచి రూ. 1,119 ధరల శ్రేణిలో గరిష్ఠంగా రూ. 30,213 కోట్లను సమీకరించాలని జియో భావిస్తోంది. ఈ ఇష్యూలో భాగంగా రూ. 10 ముఖ విలువ కలిగిన 27 కోట్ల నూతన షేర్లను జారీ చేయనుంది. ఇది భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓలలో ఒకటిగా నిలవనుంది.

## సీఈసీని రక్షించేందుకే ఇదంతా

- మొదటి పేజి తరువాయి

ఆరోపించారు. ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా బోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. "ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?" అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ**

ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు.

**'ఒకే దేశం, ఒకే పార్టీ' అజెండా**

ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. అంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధాని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు.

**సీజేపీ నేతల అరెస్ట్**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్యా షిండే నిరసన చేపట్టారు. పోలీస్ బారికేడ్లను దాటి నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై కేసు నమోదు చేసి, దాస్, రంకాలను జ్యుడీషియల్ కస్టడీకి పంపి తీహార్ జైలుకు తరలించారు. అజింక్యా షిండేను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీజేపీ లీగల్ టీం హెడ్ రత్నా సింగ్ తెలిపారు. తమ నేతల అరెస్టులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీజేపీ స్పష్టం చేసింది.

# సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా.. ఇదే మా విధానం

- మొదటి పేజి తరువాయి

**గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..**

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ. 69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

**సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..**

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేటలో దారుణం

## పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య

వివాహేతర సంబంధం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడన్న ఆగ్రహంతో రగిలిపోయిన భార్య, పెట్రోల్ పోసి నిప్పంటించి అతడిని దారుణంగా హత్య చేసింది. ఈ ఘోరం తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చోటుచేసుకుంది. మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాములమ్మ భర్తను పలుమార్లు నిలదీసింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా, రాములమ్మ ఈ ఘాతుకానికి పాల్పడింది. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను భర్తపై పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో హాహాకారాలు చేసిన బాలస్వామిని గమనించిన స్థానికులు, చికిత్స నిమిత్తం తొలుత మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న అతను మృతి చెందాడు. ఈ ఘటనపై డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ, మృతుడి నుంచి సేకరించిన మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాలు ఆధారంగా రాములమ్మను విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహిత (దీచీా) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

## విచ్ఛిన్నకర శక్తులతో జగన్ చేతులు కలిపారు

- మొదటి పేజి తరువాయి

జగన్ ప్రోత్సహించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. నేడు రాజకీయ లబ్ధి కోసం దేశ విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపారు. వైకాపా పాలనలో ఎదురైన ఇబ్బందులను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదు. ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అస్థిరత, విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తులతో కలిసి జగన్ సాగిస్తున్న రాజకీయ ప్రయత్నాలను వారు నిశితంగా గమనిస్తున్నారు. తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా తమ తీర్పును వెల్లడిస్తారు" అని పేర్కొన్నారు. సీజేపీకి మద్దతుగా జగన్ చేసిన పోస్టు.. దానికి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలపడం ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు..

# 12 కొత్త హాల్టులు

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 4 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించేందుకు, ఇప్పటికే నడుస్తున్న 3 రైళ్లను పొడిగించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వీటితో పాటు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్లను కేటాయించింది.

ఈ మార్పులకు సంబంధించిన రైళ్ల ప్రారంభ తేదీలు, పొడిగింపు తేదీలను సంబంధిత రైల్వే జోన్లు త్వరలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా వెల్లడిస్తాయని అధికారులు తెలిపారు.

**కొత్తగా ఆమోదం పొందిన రైళ్లు:**

1. రాయ్‌పూర్ -- రౌఘాట్ మెమూ (68768/68769): ఈ రైలు శనివారం మినహా వారానికి 6 రోజులు నడుస్తుంది.
రౌఘాట్ నుంచి ఉదయం 6:30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.
రాయ్‌పూర్ నుంచి మధ్యాహ్నం 1:20 గంటలకు బయలుదేరి రాత్రి 7:00 గంటలకు రౌఘాట్ వెళుతుంది.
2. హరిద్వార్ -- వెరావల్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (14326/14325): ఇది వారానికి రెండుసార్లు నడిచే సర్వీస్.
ఈ రైలు హరిద్వార్ నుంచి బుధ, ఆదివారాల్లో; వెరావల్ నుంచి గురు, సోమవారాల్లో నడుస్తుంది.
**హాల్టులు:** రూర్కీ, ముజఫర్‌నగర్, మీరట్ సిటీ, ఘజియాబాద్, ఢిల్లీ, రేవారి, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, పాలన్‌పూర్, రాజ్‌కోట్, జునాగఢ్ వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతుంది.
3. హరిద్వార్ -- ఓఖా ఏసీ ఎక్స్‌ప్రెస్ (14328/14327): ఇది వారానికి ఒకసారి నడిచే సర్వీస్.
హరిద్వార్ నుంచి శుక్రవారం, ఓఖా నుంచి శనివారం బయలుదేరుతుంది.
హాల్టులు: రూర్కీ, మీరట్ సిటీ, ఢిల్లీ, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, రాజ్‌కోట్, జామ్‌నగర్, ద్వారకలలో ఆగుతుంది.
4. బిర్ - ఇటార్సీ ప్యాసింజర్ (51689/51690): వారానికి ఒకసారి నడుస్తుంది.
బీర్ నుంచి శనివారం, ఇటార్సీ నుంచి ఆదివారం అందుబాటులో ఉంటుంది.

**పొడిగించిన సర్వీసులు:**

1. బాంద్రా (T) -- ఢిల్లీ సరాయ్ రోహిల్లా గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12216/12215): ఈ రైలును హరిద్వార్ వరకు పొడిగించారు. పొడిగింపు మార్గంలో ఢిల్లీ, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫర్‌నగర్, రూర్కీలలో అదనపు స్టాపులు ఉంటాయి.
2. గోండియా - వాడ్సా మెమూ (68806): ఈ రైలును అర్మోరి వరకు పొడిగించారు.
3. వాడ్సా - చందా ఫోర్ట్ మెమూ (68808): ఈ రైలును కూడా అర్మోరి వరకు పొడిగించారు.

**కొత్తగా కేటాయించిన హాల్టులు:**

కింది 12 రైళ్లకు కొత్తగా హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.
వల్సాడ్-వడనగర్ ఎక్స్‌ప్రెస్ (20959/20960): అంకలేశ్వర్
హతియా-హౌరా క్రియ యోగా ఎక్స్‌ప్రెస్ (18616): చకులియా
సహర్సా-అమృత్‌సర్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12203/12204): పానిపట్
హైదరాబాద్-రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17005/17006): రిగా
దర్భంగా-గోమతి నగర్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (15561/15562): రిగా
తిరుపతి-రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17433/17434): బైరగ్నియా
లౌకహా బజార్--ఆనంద్ విహార్ టెర్మినల్ స్పెషల్ (04013/04014): ఘోరసహన్
బాంద్రా (ట)--జైపూర్ ఎక్స్‌ప్రెస్ (22933/22934): నవ్‌సారి
అలప్పుజ-కన్నూర్ ఎక్స్‌ప్రెస్ (16307): వల్లిక్కున్ను
KSR బెంగళూరు-ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ (16377/16378): ఒట్టపాలెం
లోకమాన్య తిలక్ టెర్మినస్-పాట్లీపుత్ర ఎక్స్‌ప్రెస్ (12141/12142): గహ్మర్
సీల్దా-రాంపూర్‌హట్ ఎక్స్‌ప్రెస్ (13187/13188): బారక్‌పూర్

ఈ కొత్త సర్వీసులు, పొడిగింపులు, అదనపు హాల్టుల వల్ల పలు ప్రాంతాల మధ్య ప్రయాణ సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుందని, ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని రైల్వే శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

# హార్మూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు

చట్ట విరుద్ధమైన, ప్రమాదకర మార్గంలో నౌక ప్రయాణిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు చెప్పినట్లు స్థానిక మీడియా పేర్కొంది.

ప్రమాదానికి గురైన నౌక దాదాపు 2500 కంటైనర్లతో వెళు తున్నట్లు సమాచారం. వీటిలో ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్ బాటిళ్లు, తదితర వస్తువులున్నాయి. ప్రమాదం అనంతరం కంటైనర్లు చెల్లాచెదురు కాగా.. అందులోని ఐఫోన్‌లు సహా ఇతర వస్తువులు కుప్పలుగా నీటిపై తేలియాడుతున్న దృశ్యాలు కనిపించాయి. జీఎఫ్ఎస్ ప్రైడ్ అనే సింగపూర్ జెండా ఉన్న నౌక దుబాయ్ నుంచి ఈ సరకులను తీసుకువెళ్తున్నట్లు తెలుస్తోంది.

హార్మూజ్ మార్గంలో వెళ్తున్న సమయంలో సింగపూర్‌కు చెందిన రెండు సరకు రవాణా నౌకలు గుర్తు తెలియని వస్తువులను ఢీకొన్నాయని నౌకాశ్రయ అధికారులు తొలుత పేర్కొన్నారు. ఇందులో ఒకటి మునిగిపోగా.. మరొకటి సురక్షితంగా గమ్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మొదటి నౌకలోని సిబ్బంది అందర్నీ సురక్షితంగా తరలించామని, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సింగపూర్ పోర్టు అధికారులు వెల్లడించారు.

## కుప్పకూలిన పాఠశాల పైకప్పు.. 34 మంది విద్యార్థులు మృతి

ఉదయం పూట తరగతులు జరుగుతుండగా పాఠశాల భవనం పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో 34 మంది విద్యార్థులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు కూడా మరణించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మరో 40 మందికి పైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం నేపథ్యంలో పాఠశాల యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ. 75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు. దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

## సీట్ల సర్దుబాటు అంశం.. చంద్రబాబుతో మంత్రుల చర్చలు

- మొదటి పేజి తరువాయి

తుది కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, ఎంపీ లింగమనేని రమేష్ తదితరులు భేటీ అయ్యారు. సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రారంభం కానుండటంతో ఈ ప్రక్రియను త్వరగా కొలిక్కి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారు.

# మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు..

- మొదటి పేజి తరువాయి

మొత్తం 27 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది.

**7 కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులు వీరే:**

వైసీపీ ప్రకటించిన జాబితా ప్రకారం, ఏడు కీలక నగర పాలక సంస్థలకు మేయర్ అభ్యర్థులను ఖరారు చేశారు.
విజయనగరం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): కోలగట్ల శ్రావణి (వైశ్య)
విశాఖపట్నం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): వరుదు కల్యాణి (కాపు వెలమ)
ఏలూరు (బీసీ): గంటా మోహన్ రావు (తూర్పు కాపు)
మచిలీపట్నం (బీసీ - మహిళ): లంకా జ్యోతి (తూర్పు కాపు)
ఒంగోలు (అన్‌రిజర్వ్‌డ్): కుప్పం ప్రసాద్ (వైశ్య)
నెల్లూరు (అన్‌రిజర్వ్‌డ్): ఆనం విజయ్ కుమార్ రెడ్డి (రెడ్డి)
కడప (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): బండి దీప్తిరెడ్డి (రెడ్డి)

**మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్మన్ అభ్యర్థులు:**

రాష్ట్రవ్యాప్తంగా 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

**మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల జాబితా:**

ఇచ్ఛాపురం (బీసీ - మహిళ): పిలక రాజ్యలక్ష్మి (రెడ్డిక)
పలాస-కాశీబుగ్గ (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): తలసు శ్రీ పద్మ (కళింగ వైశ్య)
నర్సీపట్నం (బీసీ - మహిళ): చింతకాయల అనిత (కాపు వెలమ)
యలమంచిలి (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): బొద్దపు తులసి (కాపు)
తుని (బీసీ - మహిళ): పిట్ల రామ తులసి (శెట్టిబలిజ)
కొవ్వూరు (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): మన్నె పద్మ (కమ్మ)
రామచంద్రాపురం (బీసీ): చింతపల్లి నాగేశ్వరరావు (శెట్టిబలిజ)
కొండపల్లి (ఎస్సీ - మహిళ): నల్లమోతు తేజస్విని (మాదిగ)
తెనాలి (అన్‌రిజర్వ్‌డ్): మద్దాలి శేషాచలం (వైశ్య)
చీరాల (ఎస్సీ - మహిళ): డాక్టర్ ఇస్త్రాల్ల షెర్లీ (మాల)
బద్వేల్ (అన్‌రిజర్వ్‌డ్): రాచపూడి వెంకట సాయి కృష్ణ (వైశ్య)
ప్రొద్దుటూరు (అన్‌రిజర్వ్‌డ్): పొర్రెడ్డి నరసింహారెడ్డి (రెడ్డి)
పులివెందుల (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): వైయస్ ప్రమీలమ్మ (రెడ్డి)
మదనపల్లె (బీసీ): జింకా చలపతి (బోయ)

**నగర పంచాయతీ ఛైర్మన్ అభ్యర్థులు:**

యలేశ్వరం (ఎస్సీ - మహిళ): బదిరెడ్డి ఆశాలత (మాదిగ)
వుయ్యూరు (ఎస్సీ): పైడముక్కల దివ్య (మాదిగ)
గురజాల (అన్‌రిజర్వ్‌డ్): పోలు వీరారెడ్డి (రెడ్డి)
కనిగిరి (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): పులి శాంతి రెడ్డి (రెడ్డి)
బుచ్చిరెడ్డిపాలెం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): షేక్ షకీలా బేగం (ముస్లిం)
కమలాపురం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): మార్జుల కవిత (రెడ్డి)

పార్టీ విడుదల చేసిన ఈ జాబితాలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 27 స్థానాల్లో 14 స్థానాలు మహిళలకే కేటాయించడం విశేషం. అదేవిధంగా, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన సంఖ్యలో అవకాశాలు ఇచ్చారు. ఈ ప్రకటనతో ఆయా నగరాలు, పట్టణాల్లో ఎన్నికల సందడి అధికారికంగా మొదలైంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థులు త్వరలోనే నామినేషన్లు దాఖలు చేసి, ప్రచార బరిలోకి దిగనున్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలపై రాజకీయ నాయకులతో 16న సమావేశం



మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే ధర్మారావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 15.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల అధికారి వారి ఆదేశానుసారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ముంచంగిపుట్టు మండలం గల 14 ఎంపీటీసీ సిగ్మెంట్లలకు రిజర్వేషన్ లు ఖరారు చేసి ఉన్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే ధర్మారావు తెలిపారు. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గల సమావేశ మందిరంలో అన్నీ రాజకీయ పార్టీల నాయకులతో 16న సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నియమాలు, నోటిఫికేషన్ వివరములు, ఎన్నికల షెడ్యూల్ మరియు ఎన్నికల వ్యయం గురించి వివరించడం జరుగుతుందన్నారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుగుటకు అందరు సహకరించాలని ఎంపీడీవో కోరారు

# అధికారుల సాక్షిగా పనిచేయం బిల్లు మారుస్తాం..!

అధికారుల చేతికి డబ్బు వాసన తగిలితే పనిచేయని రోడ్లకు బిల్లులు మంజూరు అయిపోతాయి. అంటున్న గ్రామ ప్రజలు.

పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీలో 8 కి.మీ బీటీ రోడ్డులో భారీ మోసం - మట్టి దారికే రూ. 2.50 కోట్ల బిల్లు!



**హుకుంపేట పెద్దబయలు పెన్ పవర్ అక్టోబర్ 15:** పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ పరిధిలోని చిత్రకాయపుట్టు నుండి గెండలం వరకు 8 కిలోమీటర్ల బీటీ రోడ్డు సాంక్షన్ అయింది. అయితే ఈ రోడ్డు పనుల్లో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. కాంట్రాక్టర్ కేవలం 8 కిలోమీటర్లు మట్టి దారిని తోసి వదిలేసి, ఎర్త్ వర్క్ పేరుతో ఏకంగా రూ. 2 కోట్ల 50 లక్షల బిల్లునుమార్చేసారు అని గ్రామస్తులు చెబుతున్నారు . ప్రభుత్వ నిబంధనల ప్రకారం 8 కి.మీ రోడ్డు మొత్తం విలువ రూ. 7.78 కోట్లు అయితే, ఎర్త్ వర్క్ కి 22 శాతం అంటే రూ. 1.71 కోట్లు మాత్రమే రావాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా అదనంగా రూ. 79 లక్షలు ఎక్కువగా బిల్లు మంజూరు చేశారు.

ప్రత్యక్షంగా దారిని చూస్తే కొండ ప్రాంతంలో కేవలం జెసిబితో మట్టిని తోసిన దారి మాత్రమే ఉంది. కాంపాక్షన్ లేదు, సైడ్ డ్రైన్లు లేవు, రక్షణ గోడలు లేవు. ఇలాంటి కచ్చా దారికి కోట్ల రూపాయలు బిల్లు మార్చడం పట్ల గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పనితీరుపై పలు అనుమానాలు మట్టి పనే సరిగ్గా లేకపోయినా బిల్లు మంజూరు చేయడమే కాకుండా, అదనంగా బిల్లులు మంజూరు చేయడం వెనుక గల కారణాలేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆ కాంట్రాక్టర్ పై అధికారులకు ఎందుకంత మక్కువ అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తుంటే, ఇలాంటి కాంట్రాక్టర్లు, అధికారుల అండదండలతో నిధులను దోచుకుంటున్నారని, వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# 120 వార్డులు, 1,990 పోలింగ్ కేంద్రాలు..



- జీవీఎంసీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లుగ్రేటర్
- స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ కు సమన్వయంతో పనిచేయాలి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 15:** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ రెండో సా ధారణ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్ష పాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఎన్నికల సం ఘం నిబంధనలు, మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరితో కలిసి ఎన్నికల సన్నద్ధ త, భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల వ్యయ పర్యవేక్ష ణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని 120 వార్డుల్లో 778 ప్రాంతాల్లో 1,990 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 18,37,901 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఎన్నికల నిర్వహణలో సుమారు 8,000 మంది అధికా రులు, సిబ్బంది పాల్గొంటారని వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నిర్దేశిత గడు వులోగా పూర్తి చేసేందుకు ముందస్తు ప్రణాళిక తో సిద్ధంగా ఉండాలని సూచించారు. వచ్చే ఆదివారం నాటికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, షేడ్, విద్యుత్, సీసీ కెమెరాలు తదితర మౌలిక సదుపాయాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నోడల్, జోనల్ అధికారులు క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు చెందిన ప్రైవేటు భవనాల్లో పో లింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే, నిబంధనల ప్రకారం ప్రత్యామ్నాయ భవనాలను ఎంపిక చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం లో వీడియో చిత్రీకరణ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

### ఎన్నికల సిబ్బందికి శిక్షణ తప్పనిసరి

ఎన్నికల విధులకు నియమించిన అధికారులు, సిబ్బందికి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించాలన్నా రు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, తొలి విడత శిక్షణ సమయంలో సిబ్బంది నుంచి ఫారం-22లను స్వీకరించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పకడ్బం దీగా చేపట్టాలని సూచించారు. ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ, తరలింపు, భద్రపరిచే ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని సూచించా రు. బ్యాలెట్ పత్రాల వర్గీకరణ, తరలింపు వంటి కీలక ప్రక్రియలను వీడియో చిత్రీకరించాలని, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణలో నిర్దేశిత విధానాలను పాటించాలని ఆదేశించారు.

### సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక భద్రత

హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయా లని కలెక్టర్ ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతా లపై నిరంతరం నిఘా ఉంచుతూ పోలీసు శాఖ తో సమన్వయం చేసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, ఇతర పర్యవేక్షణ బృందాలు నిరంతర తనిఖీలు నిర్వ హించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘ నలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించా రు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లా డుతూ జీవీఎంసీ ఎన్నికల బందోబస్తు కోసం 6,548 మంది పోలీసు సిబ్బందిని నియమించి నట్లు తెలిపారు. నగరంతోపాటు పరిసర ప్రాం తాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తామని, సు న్నిత, అత్యంత సున్నిత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత కల్పిస్తామని వెల్లడిం చారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్త పనులకు మంజూరులు ఇవ్వడం, టెండర్లు పిలవడం వంటి చర్యలు చేపట్టరాదని, ఓటర్లను ప్రభావితం చేసే కార్యకలాపాలకు అనుమతించ కూడదని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధిం చిన అనుమతుల జారీ కోసం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు జోనల్ స్థాయిలో సింగిల్ విండో కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచిం చారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సర్వైలెన్స్ బృందాలు తమ పరిధిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, రోజువారీ నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిఘా ఉంచి, ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితు లు అమలయ్యేలా చూడాలన్నారు. అధికారులు సొంత నిర్ణయాలకు తావివ్వకుండా ఎన్నికల సం ఘం మాన్యువల్‌ను అనుసరించాలని స్పష్టం చేశారు.

### ఐదు రౌండ్లలో ఓట్ల లెక్కింపు

ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని జాగ్ర త్తలు తీసుకుంటున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న రిసె ప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను నిర్దేశిత ప్రమాణాల మేరకు పూర్తి చేస్తున్నట్లు వెల్లడిం చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఐదు రౌండ్లలో పూర్తి చేసేలా టేబుళ్లు, సిబ్బంది, ఇతర సౌక ర్యాలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలను తరలించే సమయంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మేయర్ అభ్యర్థికి రూ.40 లక్షలు, కార్పొరేటర్ అభ్యర్థికి రూ.15 లక్షల ఎన్నికల వ్యయ పరిమితి ఉన్నందున అభ్యర్థుల ఖర్చులను నిబంధనల ప్రకారం నమోదు చేసి పర్యవేక్షిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 201 రూట్లు, 239 రూట్ అధికారులు, 67 సెక్టోరల్ అధికారులు, 11 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, 11 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 20 సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వివరించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు మరో 21 బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు రమేష్, రమణమూర్తి, వర్మ, నల్లనయ్య, సత్యవేణి, మేయర్ ఎన్నికల ఆర్వో దయానిధి, సీసీపీ ప్రభాకర్‌తోపాటు పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలకు అరకులోయ అడ్డా



- అక్రమ నిర్మాణాల పై సమగ్ర విచారణ జరపాలి.
- ఆమ్ ఆద్మీ పార్టీ.సుజాత సల్మాన్.

**అరకులోయ పెన్ పవర్ అక్టోబర్ 8 :** అరకులోయ మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్న పంచాయతీ స్పెషల్ ఆఫీసర్స్ అని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ మంగళవారం ఒక పత్రిక ప్రకటనలో ఆరోపించారు. మండల రెవెన్యూ శాఖ గ్రామపంచాయతీ అధికారులకు పిర్యాదులు అందిన పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె మండి పడ్డారు.. వివరాలు ఇలా ఉన్నాయి..ఆంధ్రా ఊటీ అరకులోయలో అక్రమ కట్టడాలకు అడ్డగా మారిందని, పంచాయతీ, రెవెన్యూ అధికారులే కొమ్ముకాస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బినామీ నిర్మాణాలు జరుగుతున్నా నామమాత్రపు నోటీసులతో సరిపెడుతూ చర్యలు తీసుకోవడం లేదని స్థానిక గిరిజనులతో పాటు హమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సల్మాన్ సుజాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. .పెదలబుడు పంచాయతీ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, డీజే సెల్ దుకాణం పైన ప్రభుత్వ అనుమతి లేని అక్రమ నిర్మాణం సాగుతుందని, ఏరియా ఆసుపత్రి సమీపంలో పర్చూరి ఎదురుగా, ఏపీఆర్ కళాశాల రహదారిలో ఆనుకొని ప్రభుత్వ అనుమతి లేని నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. అలాగే బెరాకా ప్రార్థన మందిరం సమీపంలో, పాత మలేరియా కార్యాలయం ఎదురుగా నకిలీ గిరిజన ధ్రువపత్రాలతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపణలు గుప్పిస్తున్నారు...ఫిర్యాదులు చేసినా, నిత్యం వార్త దినపత్రికలో కథనాలు ప్రచురితమవుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అక్రమార్కులకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు ఇక్కడ వినిపిస్తున్నాయి. జాప్యం, నిర్లక్ష్యం తప్ప చర్యలు లేవని, ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా లెక్కచేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై బదిలీ వేటు చెయ్యాలని, శాఖపరమైన చర్యలు తీసుకొని సమర్థులైన అధికారులను నియమించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.. లేకుంటే కలెక్టర్ కు ఫిర్యాదు చేసి ఏజెన్సీ సబ్ జడ్జి కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అధికారుల వివరణ:లి నోటీసులు ఇస్తున్నామని, రెండోసారి కూడా ఇస్తామని పంచాయతీ అధికారులు చెప్పగా, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని నిర్మాణం పనులు నిలుపుదల చేస్తామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు.

# గూడెంకొత్తవీధి జడ్పీటీసీ టికెట్లు స్థానికులకే ఇవ్వాలి!

రాజకీయ పార్టీలకు స్థానిక నేతల సూచన

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 15:** త్వరలో జరగనున్న జడ్పీటీసీ ఎన్నికల్లో గూడెంకొత్తవీధి మండలానికి చెందిన స్థానికులకే అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థులుగా అవకాశం కల్పించాలని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు. మండల సమస్యలపై అవగాహన ఉండి, స్థానిక ప్రజలతో నిరంతర సంబంధాలు కలిగిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. మండలంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కొందరు నాయకులు తమ పేర్లు వెల్లడించేందుకు ఇష్టపడకుండా ఈ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇతర మండలాల నుంచి వచ్చి ఇక్కడ జడ్పీటీసీ అభ్యర్థులుగా పోటీ చేసే వారికి స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై తగినంత అవగాహన ఉండకపోవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల ప్రజా సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో ప్రయోజనం కలగకపోవచ్చని పేర్కొంటున్నారు.

**స్థానిక సమస్యలపై అవగాహన ముఖ్యం:**
గూడెంకొత్తవీధి మండలంలో మారుమూల గ్రామాలు, గిరిజన ఆవాసాలు అధికంగా ఉండటంతో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, రవాణా వంటి మౌలిక సదుపాయాల కల్పన కీలకంగా ఉంది. ఆయా ప్రాంతాల పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యక్ష అవగాహన ఉన్న ప్రతినిధులు ఉంటే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారానికి కృషి చేయడం సులభమవుతుందని స్థానిక నేతలు అభిప్రాయపడుతున్నారు.

**అన్ని పార్టీలూ పరిగణనలోకి తీసుకోవాలనే అభిప్రాయం:**
జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక సమయంలో స్థానికతతో పాటు ప్రజాసేవలో అనుభవం, ప్రజలతో సంబంధాలు, మండల అభివృద్ధిపై అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు. స్థానికులకు అవకాశం కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల సమస్యలకు ప్రాతినిధ్యం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. అయితే అభ్యర్థుల ఎంపిక అనేది ఆయా రాజకీయ పార్టీల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. స్థానికతకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఈ అభిప్రాయాలపై రాజకీయ పార్టీలు ఎలా స్పందిస్తాయో, రాబోయే జడ్పీటీసీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి ప్రమాణాలను అనుసరిస్తాయో వేచి చూడాలి.

BJP

# దేవరపల్లిలో కూటమి ఎన్నికల కసరత్తు.. అభ్యర్థుల ఎంపికపై నేతల చర్చ?

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 15:** మండలంలోని దేవరపల్లి పంచాయతీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రానున్న ఎంపీటీసీ ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో గెలుపు అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని నాయకులు అభిప్రాయపడినట్లు తెలిపారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ భవిష్యత్తు కార్యక్రమాల్లో ఐకమత్యాన్ని కొనసాగించాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, బీజేపీ మండల అధ్యక్షుడు కాకూరు శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ మొట్టడం నూకరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు లకే రామారావు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పాడి శ్రీను, మాజీ సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, సీనియర్ నాయకుడు గడుతూరి అప్పారావు, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి మొట్టడం వీవీఎస్ ప్రసాద్, మొట్టడం రామకృష్ణ, పాంగి రాజారావు, సిరిబాల రామకృష్ణ, సిరిబాల



శ్రీనివాసరాజు, ఉపసర్పంచ్ గుమ్మడి రాజు, మత్స్యరాస రామ్ కిరణ్ కుమార్, బౌడు సతీష్, యూనిట్ ఇన్‌ఛార్జి మొట్టడం రాంబాబు, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు బోండ్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలపై ఎస్పీ నిఘా..

- మారుమూల గ్రామాల్లో అమిత్ బర్దర్ ఆకస్మిక తనిఖీలు
- ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 15:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. గురువారం చింతపల్లి ఏఎస్పీ నిరంజన్ మహేంద్ర సిన్హా, గూడెంకొత్తవీధి ఎస్ఐ కె. సురేష్‌తో కలిసి మండలంలోని మారుమూల గ్రామాలైన జెర్రెల, మొండిగెడ్డ, వంచుల, రింతాడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల అప్రమత్తతను పరిశీలించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను ఎస్పీ పరిశీలించారు. బ్యాలెట్ బాక్సుల భద్రతకు కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కెమెరాల నిఘాను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**గంజాయి నిర్మూలనపై 'ఆపరేషన్ త్రిశూల్' అవగాహన:**

మరోవైపు, ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు, అక్రమ రవాణా నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ త్రిశూల్'పై మండల కేంద్రంలో ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. గంజాయి సాగు, అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించి సహకరించాలని, గంజాయి రహిత ఏజెన్సీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఎన్నికల భద్రతతో పాటు గంజాయి నిర్మూలనపై ఎస్పీ చేపట్టిన ఈ క్షేత్రస్థాయి పర్యటన పోలీసు యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేసింది.

## కూటమి సంక్షేమ పథకాలపై వైసీపీ విమర్శలు సరికాదు!

టీడీపీ నేత పసుపులేటి నాగమణి వ్యాఖ్యలు

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 15:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ పసుపులేటి నాగమణి తప్పుబట్టారు. ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వ పనితీరును విమర్శించే ముందు అమలవుతున్న పథకాలను పరిశీలించాలని ఆమె పేర్కొన్నారు.విద్యార్థుల ఆర్థిక సహాయం, రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని నాగమణి తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలుపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు సమంజసం కాదని ఆమె అభిప్రాయపడ్డారు.ప్రభుత్వ పథకాల అమలు ఆర్థిక పరిస్థితులు, నిర్ణీత మార్గదర్శకాలకు అనుగుణంగా కొనసాగుతుందని పేర్కొంటూ, ప్రజా సంక్షేమంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాజకీయ విమర్శలతో ముడిపెట్టడం సరికాదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ అభిప్రాయాలను ఓటు ద్వారా వెల్లడిస్తారని ఆమె పేర్కొన్నారు.

## వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఐడీ కార్డుల పంపిణీ

- అన్నవరంలో పార్టీ సమావేశం.. స్థానిక ఎన్నికల సన్నద్ధతపై చర్చ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ పరిధిలోని అన్నవరం గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు.జిల్లా పార్టీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశానికి దామనపల్లి పంచాయతీ అధ్యక్షుడు సాగిన సత్తిబాబు అధ్యక్షత వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వారి అవసరాలపై స్పందించాలని పేర్కొన్నారు.అనంతరం పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జీకే వీధి మాజీ ఎంపీపీ బోయిన కుమారి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, జిల్లా కోశాధికారి కుందేరి రామకృష్ణ, మండల వైస్ ఎంపీపీ లోత దేముడు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కంకిపాటి రామారావు, మండల ఉపాధ్యక్షుడు వంతల అరుణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల కార్యదర్శి తగ్గి సంజీవ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, సోషల్ మీడియా అధ్యక్షుడు పాతూను లక్ష్మణ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ అరుకు యిర్మీయ, మాజీ ఉపసర్పంచ్ గెమ్మెల చిలకమ్మతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం- కిడారి శ్రావణ్ కుమార్




**గాజువాక:పెన్ పవర్ ,అక్టోబర్ 15 :** పారిశ్రామిక ప్రాంతం గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ బీసీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి, రాష్ట్ర గిరిజన శాఖ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ హాజరై అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ అభివృద్ధికి శాస్త్ర సాంకేతిక రంగానికి అబ్దుల్ కలాం ఎనలేని సేవలు అందించారని, సామాన్య కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం పట్టుదల క్రమశిక్షణతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించి దేశ యువతకు ఆదర్శంగా నిలిచారని , భారతదేశ అంతరిక్ష పరిశోధన రంగాల్లో కీలక పాత్ర పోషించి భారతదేశానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారని కిడారి కొనియాడారు.కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు తమిరె శివప్రసాద్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కనక భవాని, 87వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ,సగర కుల నాయకురాలు ములికి రాణి,తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎన్నికల నిబంధనలపై రాజకీయ పార్టీలతో సమావేశం

ఎంపీడీవో బిహెచ్వి రమణ బాబు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 15:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిబంధనలపై చర్చించేందుకు మండలంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో అక్టోబర్ 16వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు గూడెంకొత్తవీధి ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.హెచ్.వి. రమణబాబు ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించడం, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

## అంతర్జాతీయ టార్గెట్‌బాల్ పోటీల్లో భారత జట్టు విజయంలో ఆనందపురం విద్యార్థి కీలక పాత్ర!

**ఆనందపురం, పెన్ పవర్అ,క్టోబర్ 15పెన్ పవర్ :** నేపాల్ రాజధాని ఖాట్మండులో నిర్వహించిన అంతర్జాతీయ టార్గెట్‌బాల్ ప్రెసిడెంట్ కప్ పోటీల్లో భారత జట్టు విజేతగా నిలిచింది. ఈ విజయానికి విశ్వనాథ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విద్యార్థి పైలా రూపేష్ తన వంతు సహకారం అందించారు.భారత జట్టు తరఫున అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన 12 మంది క్రీడాకారుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరుగురు ఉండగా, వారిలో చివరి సంవత్సరం చదువుతున్న రూపేష్ చోటు దక్కించుకున్నారు. తుదిపోరులో బంగ్లాదేశ్ జట్టుపై భారత్ విజయం సాధించి కప్పును కైవసం చేసుకుంది.అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చిన రూపేష్‌ను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది




అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## జిల్లా ఇన్చార్జి గిడ్డిఈశ్వరి నియోజక అబ్జర్వ్ ఎమ్మెల్సీ రాజశేఖర్ ఆధ్వర్యంలో 100 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ వలస




**జి.మాడుగుల.పెన్ పవర్. అక్టోబర్(15)** జి. మాడుగుల.మండలం,గెమ్మెల పంచాయతీ, సుర్లపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి అలాగే నియోజకవర్గ అబ్జర్వర్ ఎమ్మెల్సీ రాజశేఖర్ ఆధ్వర్యంలో సుర్లపాలెం చుట్టుపక్కల గ్రామాల నుంచి వైసీపీ పార్టీకి చెందిన వారు 100 మంది టిడిపి పార్టీలో చేరడం జరిగింది. గిడ్డి ఈశ్వరి అబ్జర్వర్ రాజశేఖర్ మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో ఈ యొక్క కూటమి ప్రభుత్వం 1000 కోట్ల రూపాయల విలువైన రహదారులు వేసిందని మిగిలిన రహదారులు కూడా కొద్ది రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ నాయకులు సోమల చిట్టిబాబు తాజా మాజీ ఎంపీపీ లంబోరి అప్పలరాజు మండల పార్టీ అధ్యక్షులు వంతల కొండలరావు పిఎసిఎస్ డైరెక్టర్ కిముడు కళ్యాణం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జి శాంతి కుమారి చిరంజీవి నాయుడు శ్రీనివాస్ నాయుడు మాతే లక్ష్మణరావు సత్తిబాబు కొండబాబు మాజీ సర్పంచులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్లాక్ డే.. ఏఐ డేటా సెంటర్లకు వ్యతిరేకంగా గ్రీన్ విశాఖ భారీ ర్యాలీ




**విశాఖ తూర్పు పెన్ పవర్,అక్టోబర్ 15:** విశాఖలో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నగరం నల్లదుస్తులతో నినదించింది. గ్రీన్ విశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ,వానను సైతం లెక్కచేయకుండా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.పాత డెయిరీ ఫామ్‌లోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ నుంచి రవీంద్ర నగర్ లాస్ట్ బస్‌స్టాప్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అన్ని వర్గాలకు చెందిన 200 మందికి పైగా ప్రజలు ఇందులో పాల్గొని తమ నిరసనను తెలిపారు.

క్లైమేట్ యాక్షన్, కోయలిషన్ ఫర్ ఏఐ రెగ్యులేషన్ సంస్థల సభ్యులు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. "స్టాక్ వైజాగ్ డాటా సెంటర్స్", "వైజాగ్ భవిష్యత్తును కాపాడుకుందాం" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీనిని 'బ్లాక్ డే ఫర్ వైజాగ్' గా పాటిస్తూ నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు.డేటా సెంటర్ల వల్ల నీటి వనరులు, విద్యుత్ వనరులు అడుగంటిపోతాయని, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ విశాఖ గౌరవ అధ్యక్షులు ప్రొఫెసర్ వి. బైరాగి రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎన్. చంద్రశేఖర్, కోశాధికారి కాంతారావు, పౌర చైతన్య వేదిక నుంచి ప్రొఫెసర్ కొలవెన్ను చంద్, సీహెచ్. ప్రమీల, ఎస్ఎఫ్ఐ నుంచి సాయితేజ తదితరులు పాల్గొన్నారు.ర్యాలీ అనంతరం రవీంద్ర నగర్‌లో 'డేటాసుర వధనం' పేరిట వీధి నాటకాన్ని ప్రదర్శించారు. డేటా సెంటర్ల వల్ల జరిగే అనర్థాలను కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో దీక్ష, ఆశా, కె. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## జింక్ గ్రౌండ్‌లో యువతకు ఎన్నికలపై అవగాహన కల్పించిన గాజువాక పోలీసులు

**గాజువాక:పెన్ పవర్ ,అక్టోబర్ 15** పారిశ్రామిక ప్రాంతం గాజువాక పి ఎస్ సీఐ వాసు నాయుడు ఆదేశాల మేరకు, గాజువాక పోలీస్ స్టేషన్ ఎస్ఐ కృష్ణబాబు జింక్ గ్రౌండ్‌లో యువకులకు ఎన్నికలపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో యువత పాత్ర, వారి విధులు, బాధ్యతలు, ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత కీలక పాత్ర పోషించాలని, ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొంటూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం



కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు .

## జీవీఎంసీ ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి -- ఏసీపీ వై. శ్రీనివాసరావు

**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 15** జీవీఎంసీ స్థానిక ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్ 16, 17, 18 తేదీలలో నామినేషన్ల దాఖలు సందర్భంగా అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని విశాఖపట్నం సిటీ పోలీస్ సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ వై. శ్రీనివాసరావు సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ర్యాలీలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. గుంపులుగా గుమిగూడడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదని సూచించారు.

ఎన్నికల ప్రచార ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, మైకుల వినియోగానికి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందాలని, అనుమతించిన సమయం, ప్రదేశం, షరతులను పాటించాలని స్పష్టం చేశారు.ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, అక్రమ నగదు పంపిణీ, ఇతర ప్రలోభాలపై నిఘా కోసం ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎంసీసీ టీమ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ ,చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రచార అనుమతుల కోసం సంబంధిత సింగిల్ విండో సిస్టమ్ అధికారులను సంప్రదించాలని సూచించారు . గాజువాక జోన్: హెచ్‌డీటీ , తహసీల్దార్ ఆఫీసు, ములగాడ -- శ్రమ, ఫోన్: 9885995195 . అగనంపూడి జోన్: హెచ్‌డీటీ , తహసీల్దార్ ఆఫీసు, పెదగంట్యాడ -- కిషోర్ కుమార్, ఫోన్: 9292002341.ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సహకరించాలని సౌత్ ఏసీపీ కోరారు.ఈ సమావేశంలో గాజువాక సీఐ శ్రీ వాసు నాయుడు, దువ్వాడ సీఐ శ్రీ గణేష్ పాల్గొన్నారు.



# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి అధికారులతో సమావేశం

* డీలర్ల కమిషన్ పెంపు, విద్యుత్ ఛార్జీల భారం తగ్గింపు, బకాయిల చెల్లింపులపై వినతి



**గాజువాక:పెన్ పవర్,అక్టోబర్ 15** విశాఖపట్నం నగర పరిధిలోని రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా అధ్యక్షుడు గంట్యాడ అప్పలరాజు ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల ప్రతినిధి బృందం సంబంధిత జాయింట్ కలెక్టర్, జిల్లా పౌర సరఫరాల అధికారి లను కలిసి వినతిపత్రం సమర్పించారు . ఈ సందర్భంగా డీలర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక, పరిపాలనాపరమైన ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.రేషన్ డీలర్లకు ప్రస్తుతం అందుతున్న కమిషన్‌ను పెంచి, పంపిణీ చేసే ప్రతి రూపాయికి అదనంగా రూ.2 చొప్పున కమిషన్ పెంపును కల్పించాలని ప్రతినిధులు కోరారు. పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు, ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డీలర్లకు న్యాయం చేసేలా సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.లబ్ధిదారులకు సంబంధించిన గన్నీ సంచుల పంపిణీ, వినియోగం, సంబంధిత సంస్థకు వాటిని అప్పగించే విధానంపై చర్చించారు. ఈ ప్రక్రియకు సంబంధించి రేషన్ డీలర్లకు రావాల్సిన గత బకాయిలను ముందుగా చెల్లించాలని అధికారులను కోరారు.రేషన్ దుకాణాలకు సంబంధించి రెండో కేటగిరీ విద్యుత్ కనెక్షన్లు, వాణిజ్య విద్యుత్ మీటర్లు, జీవీఎంసీ పరిధిలో విధిస్తున్న వాణిజ్య పన్నుల కారణంగా డీలర్లపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని అధికారులకు వివరించారు. దీనిపై జిల్లా పౌర సరఫరాల అధికారి సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు. సమస్య పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్, జీవీఎంసీ కమిషనర్‌లకు లేఖలు పంపించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వారంలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపినట్లు వెల్లడించారు.రేషన్ సరుకుల పంపిణీలో ఖచ్చితమైన తూకం కోసం వినియోగించే తూకపు యంత్రాల నిర్వహణ, మరమ్మతులు, అవసరమైన మార్పుల కోసం డీలర్లు తమ కమిషన్‌లో కొంత మొత్తాన్ని ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రతినిధులు వివరించారు. ఈ భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తగిన సహకారం అందించాలని కోరారు.నిత్యావసర సరుకుల పంపిణీకి అవసరమైన పరికరాలు, ఇతర సామగ్రితో పాటు కొంతకాలంగా అందుబాటులో లేని కాగితపు రోల్స్‌ను తిరిగి సరఫరా చేయాలని కోరారు. రేషన్ పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన సామగ్రిని సకాలంలో అందుబాటులో ఉంచాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.రేషన్ డీలర్లందరికీ ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం ఈఎస్ఐ ద్వారా వైద్య సదుపాయాలు కల్పించాలని ప్రతినిధి బృందం కోరింది. డీలర్ల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఇప్పటికే సమాచారం అందించినట్లు, మరికొద్ది రోజుల్లో వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సమావేశంలో తెలిపినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంట్యాడ అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అయ్యపబాలే, కోశాధికారి మణిబాబు, శ్రీను, దుర్గాప్రసాద్, ఈశ్వర అప్పారావు, రాణి, నందిని, హరి తదితర జిల్లా రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో శాంతిభద్రతలపై రాజీ వద్దు!

* సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి
* రౌడీషీటర్లు, పాత నేరస్తులపై ముందస్తు చర్యలు చేపట్టాలి
* ఎన్నికల విధుల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి
* ఆరు జిల్లాల ఎస్పీలకు విశాఖ రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జట్టి ఆదేశాలు




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 15 :**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని విశాఖపట్నం రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జట్టి పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం విశాఖ రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల ఎస్పీలతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయడంతోపాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఘర్షణలకు ఆస్కారమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. అవసరమైన అదనపు పోలీసు బలగాలను సమీకరించి, బందోబస్తుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

### రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

ఎన్నికల సమయంలో హింస, బెదిరింపులు, ఘర్షణలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఐజీపీ స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు.

### రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు

ఎన్నికల విధుల్లో పోలీసు అధికారులు రాజకీయ ప్రభావాలకు అతీతంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఐజీపీ స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై తక్షణమే స్పందించాలని, రెవెన్యూ, ఎన్నికల అధికారులతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. ప్రతి జిల్లాలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, పోలవరం జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# విశాఖ మేయర్ గా వరుదు కళ్యాణి - వైఎస్సార్సీపీ పట్టం

జనరల్ మహిళ రిజర్వేషన్ లో బీసీ నేతకు అవకాశం - ఎవరీ కళ్యాణి?

**విశాఖపట్నం పెన్ పవర్,అక్టోబర్ 15:**గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జీవీఎంసీ మేయర్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పేరును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. బుధవారం రాత్రి పార్టీ విడుదల చేసిన మేయర్ అభ్యర్థుల జాబితాలో విశాఖ నుంచి వరుదు కళ్యాణి పేరును ప్రకటించింది. విశాఖ మేయర్ పీఠం జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని పార్టీకి విధేయురాలైన బీసీ నేత కళ్యాణికి అవకాశం కల్పించినట్లు సమాచారం.(ప్రస్తుత హోదా: శాసన మండలి సభ్యురాలు ఎమ్మెల్సీ), వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు.

**విద్యార్హత:బీఎస్సీఅగ్రికల్చర్, ఎంబీఏ**

రాజకీయ ప్రస్థానం:

- 2001లో శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం జెడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభం.
- 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున శ్రీకాకుళం ఎంపీగా పోటీ.
- వైఎస్సార్సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయకర్తగా బాధ్యతలు.
- గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్ పర్సన్ గా సేవలు.
- 2021లో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నిక.

శాసన మండలిలో బీసీ రిజర్వేషన్లు, మహిళా భద్రత, సంక్షేమ పథకాలపై గట్టిగా మాట్లాడే నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు.



# శ్రీ బగళాముఖి అమ్మవారికి విశేష పూజలు



### లోకక్షేమం కోసం మహా హోమం

**విశాఖ, పెన్ పవర్, అక్టోబర్ 15 :** శ్రీ మంగళ కాళీపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నా యి. ఉత్సవాల్లో భాగంగా గురువారం 5 వ రోజు జగజ్జనని శ్రీ బగళాముఖి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, లోకకల్యాణం, విశ్వశాంతి కోసం మహాహోమాన్ని భక్తిపూర్వకంగా నిర్వహించారు.వేదమంత్రోచ్చారణలు, అర్చనలు పవిత్ర హోమాగ్ని ఆహుతులతో పీఠ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సకలజనుల ఆయుబ్షురారోగ్యాలు, సుఖసంతోషాలు,దేశ సౌభాగ్యం, ప్రకృతి సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శ్రీశ్రీశ్రీ పరమేశ్వరానందగిరి స్వామీజీ వారి ఆధ్వర్యంలో,పరమ గురుదేవులు మహావతార్ బాబా జీ వారి దివ్య ఆశీస్సులతో కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అమ్మవారి కరుణాకటాక్షాలతో లోకమంతా శాంతి సౌభాగ్యాల తో వర్ధిల్లాలని పీఠం ఆకాంక్షించింది.

# రోడ్లు లేని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

ఆదివాసి చైతన్య యాత్రలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సాగిన ధర్మాన్నపడాల్ డిమాండ్




**జి.మాడుగుల.పెన్ పవర్ అక్టోబర్ (15)** ఒక్క గెమ్మెలి పంచాయతీ పరిధిలో 8 గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు గొడుగురాయి చిన్నకొత్తూరు గొర్రెలమెట్ట చీమలపాడు దుక్కలగొయ్యి ఊడపాలెం వందనపల్లి పెద్దబయలు రోడ్డు సౌకర్యం లేక ఇప్పటికీ డోలుమోతలతో ఇబ్బంది పడుతున్నారు. గత ఐదు సంవత్సరాల నుండి రోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పడం తప్ప ఇప్పటికీ పూర్తి చేయలేదు.కావున ఈ 8 గ్రామాలలో తక్షణమే రోడ్డు పనులు పూర్తిచేసి డోలుమోతాలు తగ్గించాలి అని అన్నారు.

ఆదివాసుల హక్కులపై ప్రభుత్వ వైఖరి.1/70 చట్టం రద్దు కోసం కొంతమంది ప్రయత్నాలు చేస్తుంటే, ఆదివాసుల రక్షణ కోసం ఉండవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ సుప్రీంకోర్టులో కౌంటర్ ఫైల్ దాఖలు చేయలేదు. అదే సమయంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు, బాక్సైటు, జాతీయ రహదారుల పేరుతో వేలాది ఎకరాల భూములను కార్పొరేట్ కంపెనీలకు మంజూరు చేస్తున్నారు. ఇది ఆదివాసుల ప్రయోజనాలను పక్కనపెట్టి కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఆదివాసీ రిజర్వేషన్ పై సీఎం హామీలు అమలు కాలేదు జీవో నెంబర్ 3 ప్రకారం 100 శాతం రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదు. హైపర్ కమిటీ పేరుతో గిరిజనులను మభ్యపెట్టి మోసం చేశారని సిపిఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. 2025 డీఎస్సీలో ఆదివాసి యువకులకు తీవ్రమైన అన్యాయం జరిగింది. 2026 డీఎస్సీలో కూడా ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.ఆదివాసి చైతన్య యాత్ర ద్వారా ఈ సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఈ యాత్ర నిర్వహిస్తున్నాం కావున ఈ యాత్ర జయప్రదం చేయాలని కోరుతున్నాం

ఈ చైతన్య యాత్ర సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సాగిన ధర్మన్న పడాల్ ఆధ్వర్యంలో జరుగుతుంది .ఈ చైతన్య యాత్ర రథసారధులు సాగిన ధర్మన్న పడాల్.వనుగు సన్యాసి దొర.సలుగు సత్తిబాబు అర్లాబు సత్యనారాయణ.వంజరి పిన్నమనాయుడు వలసంనాయుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అబాండెడ్ వాహనాల యజమానులు పోలీసులను సంప్రదించాలి

అన్ని ఒరిజినల్ పత్రాలతో గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌కు రావాలి



The details of the Vehicles are as follows:

| Sl. No. | Vehicle Details | Engine No. |
|---|---|---|
| 1. | Honda Activa – AP24AH2211 | JC44E0842245 |
| 2. | Honda Activa – AP31DJ2361 | JF50ET3318443 |
| 3. | Scooty – AP31AP5992 | KF07E9137368 |
| 4. | TVS XL – AP31AA6044 | P1207M616317 |
| 5. | TVS – AP31AP4028 | AF5F61480329 |
| 6. | Splendor – AP32D0540 | 02E18E07184 |
| 7. | Passion Pro – AP31BB5885 | HA10ED9GD3050 |
| 8. | CT 100 – AP04H9417 | DUMBNC22020 |
| 9. | Pulsar – AP31AN1586 | DJGDMM16930 |
| 10. | Discover – AP31CJ1696 | JBZWDE94886 |
| 11. | Scooty – AP30D30212 | 0G1D42089733 |

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 15 :** గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తించిన గుర్తుతెలియని, నిరుపయోగంగా వదిలివేయబడిన (అబాండెడ్) వాహనాలకు సంబంధించి వాటి యజమానులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని గోపాలపట్నం పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గోపాలపట్నం పోలీస్ స్టేషన్ నుంచి ప్రెస్ నోట్ విడుదల చేశారు. పోలీసులు గుర్తించిన సదరు వాహనాలకు సంబంధించి గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 130/2024తో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా, గుర్తించిన వాహనాలను కేసు ప్రాపర్టీగా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా వాహనాలకు సంబంధించిన అసలు యజమానులను గుర్తించి, వాటి యాజమాన్య వివరాలను ధ్రువీకరించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ వాహనాలు తమకు చెందినవని భావించే వ్యక్తులు వాహనాల ఒరిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), తమ గుర్తింపును నిర్ధారించే పత్రాలు, యాజమాన్యానికి సంబంధించిన ఇతర ధ్రువీకరణ పత్రాలతో గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌కు స్వయంగా హాజరుకావాలని సూచించారు. సంబంధిత పత్రాలను పరిశీలించి, వాహనాల యాజమాన్యాన్ని నిర్ధారించిన అనంతరం చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కావున, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తించిన ఈ వాహనాలకు సంబంధించిన యజమానులు ఎవరైనా ఉంటే ఆలస్యం చేయకుండా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి, అవసరమైన పత్రాలను సమర్పించాలని పోలీసులు కోరారు.

# గోదావరి పుష్కరాలకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలి

* మౌలిక వసతులపై అధికారులతో సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ చర్చ




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 15:**పుష్కర ఘాట్లు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, సమస్యలపై వివరాలు రాజమహేంద్రవరం డివిజన్ సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 2027 గోదావరి పుష్కరాల సన్నాహకాలపై సమావేశం నిర్వహించారు. పుష్కరాల ప్రత్యేక ఉప కలెక్టర్ (ఎస్‌డీసీ) మహేష్‌తో పాటు రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, రాజానగరం, కడియం, సీతానగరం, కోరుకొండ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించి కార్యాచరణ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ అంశాల వారిగా అధికారులతో చర్చించారు.గత పుష్కరాలలో యాత్రికుల రాక, 2027 పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్యపై అంచనాలు, సౌకర్యాల కల్పనపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఘాట్ల వద్ద స్నాన సదుపాయాలు, రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రవాణా, భద్రత వంటి పనులను గుర్తించి, మండలాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయలన్నారు.

## వాడపల్లి వెంకన్న నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

భక్తిశ్రద్ధలతో ఏడు వారాల నోము అష్టోత్తర పూజల్లో భక్తులు



**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 15:** కోనసీమ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటూ భక్తిపారవశ్యంలో మునిగితేలుతున్నారు. ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు నోము ముగింపు సందర్భంగా స్వామివారి సన్నిధిలో అష్టోత్తర పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు.అన్నదానానికి దాతల చేయూత ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకం ద్వారా భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమానికి భక్తులు తమ వంతు సహకారంగా విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్, రంగారెడ్డి ప్రాంతాలకు చెందిన కె. ప్రణతి, చిరంజీవి, కె. అనన్య కుటుంబ సభ్యులు నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,000 విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ దాతలకు ఆశీర్వచనం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని వారికి బహూకరించారు. భక్తులకు అన్నప్రసాదం అందించే పవిత్ర సేవలో భాగస్వాములైన దాతలను ఆలయ వర్గాలు అభినందించాయి. నిత్య అన్నదాన పథకం నిర్వహణకు భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ "దశరథ రామయ్య లంక" కి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్, 15:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో ఎ. ఐ . ఎం.ఎల్ ఇంజనీరింగ్ విభాగం నందు అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న"దశరథ రామయ్య లంక" గ్లోకల్ యూనివర్సిటీ సహరాన్ పూర్ ఉత్తరప్రదేశ్ నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " గ్లోకల్ యూనివర్సిటీ కి చెందిన డా . ప్రతాప్ సింగ్ పట్వాల్ నేతృత్వంలో దశరథ రామయ్య సమర్పించిన "థీసిస్ శీర్షిక: "ప్రోటీన్-ప్రోటీన్ పరస్పర చర్య అంచనాలో పురోగతులు: పర్యవేక్షించని మరియు పర్యవేక్షించబడిన మెషిన్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్‌లను ఏకీకృతం చేయడం" అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా .దశరథ రామయ్య " భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, విభాగాధిపతి డా.కె.ఎన్.భార్గవి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది "డా.దశరథ రామయ్య లంక " కి అభినందనలు తెలియజేశారు.

## ఆదిత్య లో ఘనంగా కలాం జయంతి వేడుకలు



**గండేపల్లి, పెన్ పవర్ , అక్టోబర్, 15:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన అబ్దుల్ కలాం భవనం నందు భారతదేశం మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్‌గా కీర్తింపబడిన భారతరత్న డా. అబ్దుల్ కలాం జయంతి మరియు గురువారం వరల్డ్ స్టూడెంట్స్ డే సందర్భంగా క్యాంపస్ లోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.టి.వి.ఎస్. కుమార్ మాట్లాడుతూ నిరాడంబరుడు, కడు పేదరికంలో పుట్టిన గొప్ప జ్ఞానసంపన్నుడు కలాం అన్నారు. మనం కలాం సమకాలీనంలో జీవించి ఉండడం మన అదృష్టం అని, ఏ ఒక్కరూ పేదరికంతో నేను అవకాశాలు కోల్పోయాను అనే భావనతో ఉండకూడదని అన్నారు. ఆయన జీవితమే ప్రత్యేక ఉదాహరణ అన్నారు. మహోన్నత నేత ఆదర్శమూర్తి అబ్దుల్ కలాం అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాల డీన్ మాధవరావు, వివిధ విభాగాధిపతులు , గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్, 15 :** పెదబ్రహ్మదేవం గ్రామంలో గల శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యశీలో 67వ వార్షిక శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవరోజు(గురువారం) లలిత త్రిపుర సుందరి దేవి అవతారం లో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కీ. శే.తోటకూర సూర్యనారాయణ గారి కుమారుల కుటుంబ సభ్యుల చే ఏకవార రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3-00 గం.ల నుండి 5-00 గం. ల వరకు సువాసినుల చే "శ్రీ లలితా సహస్రనామ" పారాయణ ,సాయంత్రం 5-30 ని.ల నుండి కుంకుమార్చనలు,6-30 ని,లకు నిత్య పూజ నీరాజనం మంత్రపుష్పం,ప్రసాద వితరణ జరిగింది. ది.17-10-2018 శని వారం విద్యార్థులచే ఉదయం 7-00 గం.నుండి 8-30 వరకు సామూహిక సరస్వతి పూజలు,18-10-2026 ఆదివారం ఉదయం 5-00నుండి 8-00 వరకు సామూహిక అష్ట లక్ష్మి పూజలు జరుగుతాయని సమితి గౌరవ అధ్యక్షులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు తోటకూర సాయి రామకృష్ణ, సమితి అధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి వింజమూరి విశ్వనాధ్, సభ్యులు టి వి వి సత్యనారాయణ, నువ్వుల వెంకట్రాజు, నువ్వుల బాబ్జి, నువ్వుల సూర్యచంద్రరావు, తాడాల దొరబాబు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## యువతకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం




**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 15 :** భారత క్షిపణి పితామహుడు, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం,ఆయన ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డాక్టర్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు కలాం సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ.. "యువత కలలు కనాలి.. ఆ కలలను సాకారం చేసుకునేందుకు కష్టపడాలి" అన్న అబ్దుల్ కలాం సందేశం దేశ యువతకు మార్గదర్శకమని అన్నారు.సామాన్య కుటుంబంలో జన్మించి, నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతూ అసాధారణ విజయాలను సాధించిన కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు.ఆయనను స్మరించుకోవడం ద్వారా యువతలో సంకల్పబలం, పట్టుదల మరింత పెరుగుతాయని తెలిపారు. దేశ అంతరిక్ష పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కలాం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.దంత వైద్య నిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజల రాష్ట్రపతిగా పేరొందిన అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, దేశాధ్యక్షుడిగా భారతదేశానికి ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. తన దూరదృష్టితో దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన గొప్ప విజనరీ నాయకుడని అన్నారు. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి నిరుపమానమని, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఆయన ఆలోచనలు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.కలాం గొప్ప మానవతావాది, దేశభక్తుడని, దేశానికి శాస్త్ర సాంకేతిక రంగాల్లో బలాన్ని చేకూర్చిన మహనీయుడని కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకుంటూ,ఆయన చూపిన మార్గంలో పయనించడం ద్వారా నిజమైన నివాళులు అర్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తేజేశ్వరరావు, అశ్విని,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమం

**నూతన ఆవిష్కరణలతో వ్యాపారవేత్తలుగా ఎదగాలి: ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి**



**గండేపల్లి, పెన్ పవర్ (సురంపాలెం), అక్టోబర్ 15** విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, తమ వినూత్న ఆలోచనలతో నూతన వ్యాపారాలను ప్రారంభించి, ఇతరులకు సైతం ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి పిలుపునిచ్చారు.సురంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) ఆధ్వర్యంలో గురువారం 'వ్యాపారవేత్తగా ఎదగడం, నూతన ఆవిష్కరణలు, అంకుర సంస్థల అవకాశాలు' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇండియా (ఎన్‌సీఐఈ ఇండియా) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎలియా తాగరం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను ఆచరణలో పెట్టి, వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా ఎలా మలచుకోవచ్చో వివరించారు. నూతన ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలు, అంకుర సంస్థల స్థాపనకు అనుసరించాల్సిన విధానాలు, వ్యాపార రంగంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీఐఈ ఇండియా ద్వారా విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలకు అందిస్తున్న శిక్షణ, సహకారం, వివిధ ప్రోత్సాహక కార్యక్రమాలను వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు.

ఈ సందర్భంగా ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగాల కోసం ప్రయత్నించడంతోపాటు, స్వయం ఉపాధి దిశగా ఆలోచించాలని సూచించారు. సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు, వ్యాపార నైపుణ్యాలను పెంపొందించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తద్వారా మరికొందరికి ఉపాధి కల్పించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డా. ఏ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం

**రైతు సేవా కేంద్రాల ద్వారా ఉచితంగా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ**



**కాజులూరు, పెన్ పవర్ అక్టోబర్ 15:** పంట పొలాల్లో ఎలుకల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించి, పంటలను సంరక్షించేందుకు కాజులూరు మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎలుకల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు, రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ద్వారా ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు.కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు.విషపు ఎర తయారీ, వినియోగంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.ఎలుకల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎలుకల నివారణను వ్యక్తిగతంగా కాకుండా మండలంలోని రైతులందరూ సమన్వయంతో ఒకేసారి చేపట్టాలని అధికారులు సూచించారు. సామూహికంగా చర్యలు తీసుకున్నప్పుడే ఎలుకల సంతతిని నియంత్రించి, పంట నష్టాన్ని తగ్గించేందుకు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ప్రశాంత్, శ్రీనివాస్, గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏలు), రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 15 :** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, క్షిపణి పితామహుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో గురువారం కాకినాడలోని వివేకానంద పార్క్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు యాళ్ళ రత్నారావు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమ ఛైర్మన్ యక్కల మోహనరావుతో పాటు క్లబ్ సభ్యులుపుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు యాళ్ళ రత్నారావు మాట్లాడుతూ, డాక్టర్ అబ్దుల్ కలాం నిరాడంబరతకు, దేశభక్తికి, అంకితభావానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. శాస్త్రవేత్తగా దేశ రక్షణ రంగానికి విశేష సేవలందించడంతో పాటు, రాష్ట్రపతిగా ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. విద్యార్థులు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు పట్టుదలతో నిరంతరం కృషి చేయాలని కలాం ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమ ఛైర్మన్ యక్కల మోహనరావు మాట్లాడుతూ, సాధారణ కుటుంబంలో జన్మించిన కలాం తన ప్రతిభ, కృషి, పట్టుదలతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. విద్య, విజ్ఞానం, నైతిక విలువలు, దేశసేవ పట్ల యువతలో అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు యడవల్లి మురళీధర్, ఏ.భాస్కరరావు, బండారు భాస్కరరావు, కుటుంబరావు, క్లబ్ కార్యదర్శి దామిశెట్టి శ్రీనివాస్ తదితర సభ్యులు పాల్గొన్నారు.డాక్టర్ అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా సమాజసేవతో పాటు యువతలో దేశభక్తి, విద్య,విజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు తమ క్లబ్ కృషి చేస్తుందని సభ్యులు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలి




✸ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, అక్టోబర్ 15 పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ, ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా పరిషత్ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లు, సన్నాహాలు, అధికారుల బాధ్యతలపై సమీక్షించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చేయాల్సినవి, చేయకూడని అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. జోనల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం నియమించిన అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, నోటిఫికేషన్ జారీ, అభ్యర్థుల అర్హతల పరిశీలన, ఎన్నికల గుర్తుల కేటాయింపు, ఓటర్ల జాబితాల తయారీ, ఓటరు స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఎన్నికల సామగ్రి సరఫరా, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల నిర్వహణ, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై ఈ నెల 17న ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వాహనాలను కేటాయించాలని సూచించారు.గతంలో పోలింగ్ ఉల్లంఘనలు జరిగిన కేంద్రాలను గుర్తించి, నిబంధనల ప్రకారం క్రిటికల్, అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా వర్గీకరించాలని కలెక్టర్ తెలిపారు. ఆయా కేంద్రాల్లో అవసరాన్ని బట్టి సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్, వీడియో చిత్రీకరణ, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండల కేంద్రాలకు ఇప్పటికే చేరిన ఎన్నికల సామగ్రిని అధికారులు మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు జిల్లా, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి ఈ నెల 26న మొదటి విడత, 30న రెండో విడత శిక్షణ నిర్వహించాలని తెలిపారు. పురపాలక సంఘాల ఎన్నికల సిబ్బందికి ఈ నెల 22న మొదటి విడత, 26న రెండో విడత శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. మొదటి విడత శిక్షణను సిబ్బంది పనిచేసే ప్రాంతాల్లో, రెండో విడత శిక్షణను వారు పోలింగ్ విధులు నిర్వహించనున్న ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కూడా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు.పురపాలక సంఘాలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీల ప్రాతిపదికన జరుగుతాయని, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పార్టీలకు అతీతంగా నిర్వహిస్తారని కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, నిబంధనలు, విధివిధానాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పేనాయక్, పెద్దాపురం ఆర్డీవో పి. కృష్ణమూర్తి, జిల్లా పరిషత్ సీఈవో వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు, జిల్లా పంచాయతీ అధికారి పి. రవికుమార్, డిప్యూటీ సీఈవో శ్రీలలిత, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు నోడల్ అధికారి జె. వేణుగోపాల్, పెద్దాపురం డీఎల్‌డీఓ స్వప్న, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. జగన్నాథం, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయులపై దాడులు ప్రతి ఒక్కరూ ఖండించాలి.

-సిఐటీయూ జిల్లా అధ్యక్షులు దువ్వా శేషు బాబ్జీ.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్, 15:** పాత్రికేయులపై దాడులు ప్రతి ఒక్కరూ ఖండించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి అన్నారు.ప్రత్తిపాడు మండలం ప్రజాశక్తి విలేకరి సిగిరెడ్డి రమేష్ పై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడడాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దువ్వా శేషు బాబ్జీ తీవ్రంగా ఖండించారు. దాడిలో గాయపడ్డ రమేష్ ను దువ్వా శేషుబాబ్జి గురువారం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ?మండలంలోని లంపకలోవ గ్రామంలో డీ-పట్టా భూమి విషయంలో కొందరు వ్యక్తులు వ్యవహరిస్తున్న తీరుపై మండి పడ్డారు. సాగులో ఉన్న డీ-పట్టా భూమిని స్వాధీనం చేసుకుని, గోశాలల పేరుతో తప్పుడు అనుమతులు పొందారని ఆరోపించారు. అనుమతులు ఒకరి పేరున తీసుకుని, అక్కడ కబేళా ఏర్పాటు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. రాజమండ్రి, సామర్లకోట ప్రాంతాలకు చెందిన మాగా పు గణపతి, భరత్ అనే వ్యక్తులు ఇక్కడకు వచ్చి విలేకరిపై దాడి చేయడం వెనుక పెద్ద కుట్రే ఉందని దుయ్యబట్టారు. ఈ అక్రమ వ్యాపారాలు, పశువుల రవాణాపై ఇప్పటికే వారి పై అనేక కేసులు ఉన్నప్పటికీ, వారు తమ పద్ధతి మార్చుకోలేదని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి డీ-పట్టా భూమిని యథాతథంగా ఉంచాలని, గోశాల పేరుతో ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరిపై దాడి చేసిన వారిపై, అలాగే పాత కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, సిఐటియు నాయకురాలు కాకి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో ఎన్నికల కోడ్ అమలు.. నిబంధనలు పాటించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ సమీక్ష




**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 15:** రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో కాకినాడ నగరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు.గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల కోడ్ అమలు, ఎన్నికల వ్యయాల నమోదు, ప్రచార సామగ్రి ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలపై సమీక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రి విషయంలో రాజకీయ పార్టీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి సందేహాలు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, దివ్యాంగుల కోసం ర్యాంపులు వంటి కనీస సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వివరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీసు, ఎన్నికల అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను గౌరవిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణకు అన్ని పార్టీలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, మేనేజర్ శిరీష్ కుమార్, సూపరింటెండెంట్లు సీతారాం, సతీష్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## 15 చైన్ స్నాచింగ్ కేసులు ఛేదన



**రూ.40 లక్షల బంగారం స్వాధీనం**

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 15:** కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.40 లక్షల విలువైన 280 గ్రాముల బంగారు గొలుసులు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు లంకా దొరబాబు (46), మందపల్లి వీర్రాజు (41)లను గురువారం కాకినాడ రూరల్ మండలం ఎస్. అచ్యుతాపురంలోని జనచైతన్య లేఅవుట్‌లో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత మూడేళ్లుగా ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని 15 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాలతో అదనపు ఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలు సాంకేతిక ఆధారాలతో కేసులను ఛేదించాయి. నిందితులను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

## సామూహిక ఎలుకల నివారణపై రైతులు దృష్టి సారించాలి.

-మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి



**కిర్లంపూడి,పెన్ పవర్, అక్టోబర్,15:** సామూహిక ఎలుకలు నివారణ పై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి పిలుపునిచ్చారు.

మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవసాయ అధికారిణి నాగం సుధామాధురి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామచంద్రాపురం, కిర్లంపూడి గ్రామాల్లో నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని, రైతులందరూ ఒకేసారి ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వరి పంట చిరుదశలో ఎలుకల ఉధృతి అధికంగా ఉంటుందని, వీటి కారణంగా 8 నుంచి 10 శాతం వరకు దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడయాలిన్ మందును 100 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 96 శాతం నూకలకు 2 శాతం బ్రోమోడయాలిన్ మందు, 2 శాతం నూనె కలిపి విషపు ఎరను తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎన్ సీతారామమూర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటలక్ష్మి, మణికంఠ, మంజూష, రమ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## భారతరత్న అబ్దుల్ కలాం నేటి యువతకు ఆదర్శం కావాలి.



**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 15:** భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేటి యువతకు ఆదర్శం కావాలని మార్స్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ అధినేత అడపా దుర్గారావు అన్నారు. భారత క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మార్స్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ నిర్వాహకుడు దుర్గారావు వేడుక గురువారం నిర్వహించారు. స్థానిక ఎంఈఓ ఆఫీస్ ప్రాంగణంలో మండల యూటీఎఫ్ నాయకులు మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నేతృత్వంలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 1931 అక్టోబర్ 15న జన్మించారు. ఆయన భారతదేశానికి 11వ రాష్ట్రపతిగా సేవలందించారు అన్నారు. భారత అంతరిక్ష పరిశోధన, క్షిపణి సాంకేతిక రంగాల్లో విశేష కృషి చేశారు. అందుకే ఆయనను భారత క్షిపణి పితామహుడు అని పిలుస్తారు.సామాన్య కుటుంబంలో జన్మించిన కలాం ఎన్నో కష్టాలను అధిగమించి శాస్త్రవేత్తగా ఎదిగారు. విద్యార్థులంటే ఆయనకు ఎంతో ఇష్టం. యువతలో స్ఫూర్తిని నింపుతూ, కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి కష్టపడాలని యువతను కలాం చైతన్యపరిచే వారన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జె. సోమరాజు, ఉపాధ్యాయులు తూమురౌతు శ్రీనివాసరావు, గిరీశ్వరరావు, భాస్కర్, చిన్నారావు, నాగ ప్రసాద్, రామకృష్ణారెడ్డి, పి సుబ్బారావు, కోరాడ రాజు, గోళ్ళ విజయ్, తెల్ల ప్రియాంక, కుంజం విజయ, ఇందిర, నూకరత్నం, గౌరీ పార్వతి, బ్లేస్సి, మంజు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక ఎలుకల నివారణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చు.

-ఏలూరు పొలం బడి కార్యక్రమంలో ఏఓ, జోకా అమృత.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,అక్టోబర్,15:** సామూహిక ఎలుకల నివారణతోనే రైతులు అధిక దిగుబడిలు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత అన్నారు.ప్రత్తిపాడు మండలంలోని ఏలూరు గ్రామంలో సామూహిక ఎలుకల నివారణ, 'పొలం బడి' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రైతు సేవా కేంద్రం పరిధిలో మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎలుకల వల్ల కలిగే పంట నష్టాన్ని నివారించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల బెడదను అరికట్టేందుకు రైతులందరూ ఒకే సారి నివారణ చర్యలు చేపట్టాలని జోకా అమృత సూచించారు. ఎలుకలు ఆహార ధాన్యాలను తినడంతోపాటు అధిక మొత్తంలో ధాన్యాన్ని పాడుచేస్తాయని వివరించారు. పొలం గట్లపై కలుపు మొక్కలను తొలగించడం, గట్ల పరిమాణాన్ని తగ్గించడం, వీలైనంతవరకు ఒకేసారి నాట్లు వేయడం వంటి పద్ధతులతో ఎలుకల ఆవాసాలను తగ్గించవచ్చన్నారు. పైరు తొలిదశలోనే ఎలుక బోనులు, బుట్టలను వినియోగించాలని, ఎలుకల సహజ శత్రువులైన గుడ్లగూబల సంరక్షణకు పొలాల్లో పంగల కర్రలు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన నివారణ పద్ధతులను పాటించాలని, రసాయన మందుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు గ్రామ పెద్దలు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది అర్జున్, వరహాలు, మణికంఠ పాల్గొన్నారు.

## నేటి నుండి ఏలేశ్వరం మున్సిపాలిటీ ఎన్నికలకు నామినేషన్లు.



**ఏలేశ్వరం, పెన్ పవర్ , అక్టోబర్ 15:** నేటి నుండి ఏలేశ్వరం మున్సిపాలిటీ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసుకోవాలని కమిషనర్ ఏఎన్ జ్ఞాన ప్రకాష్ గురువారం ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదలైన కారణంగా మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 16 ,17, 18 తేదీలలో ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు నిర్విరామంగా చైర్పర్సన్, వార్డ్ కౌన్సిలర్ల నామినేషన్ పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో సూపర్వైజర్ ఆఫీసర్ కు అందజేయాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థి వెంట ఒక సపోర్టర్, ఒక ప్రపోజర్ ను మాత్రమే అనుమతి ఇస్తారన్నారు. ఆఫీస్ ప్రాంగణంలోకి గుంపులు గుంపులుగా రావడం నిషేధమన్నారు. నామినేషన్ల పరిశీలన 19న జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణ ఈనెల 21 తో ముగుస్తుంది అన్నారు. అలాగే పోలింగ్ 28న నిర్వహిస్తామని, ఎన్నికల ఫలితాలు 30న ప్రకటిస్తారని కమిషనర్ తెలిపారు.

నేటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుంది కాబట్టి పట్టణంలో ఎక్కడ రాజకీయ నాయకుల కటౌట్లు పెట్టరాదని, విగ్రహాలకు తప్పనిసరిగా ముసుగు ధరించి ఉంచాలన్నారు. నియమాలు ఉల్లంఘించి ఫ్లెక్స్ లో కటౌట్లు కట్టిన యెడల ఎన్నికల నియమావళి ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయి అన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్ వినయ్ ప్రసాద్, ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.

# నవంబర్ 6 వరకు ఉపాధ్యాయ ఓటర్ల నమోదు

* కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 15:**.ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి నగరపాలక సంస్థ పరిపాలనా పరిధిలో సాధారణ నివాసితులుగా గల అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచించారు. నవంబరు 6వ తేదీలోగా ఆర్ఎంసి కార్యాలయంలోని పరిపాలనా విభాగంలో ఫారం-19 ను ధృవీకృత, అధీకృత పత్రాలతో సమర్పించవలసిందిగా తెలిపారు. లేదా ఆన్ లైన్ ద్వారా నమోదు పూర్తి చేసుకోవాలన్నారు. నవంబరు 25న డ్రాఫ్ట్ పబ్లిష్ అవుతుందన్నారు. నవంబర్ 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని.. డిసెంబర్ 30న తుది జాబితా విడుదల వుతుందని తెలియజేశారు. నమోదుకు సంబంధించి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు సెకండరీ స్థాయి నుంచి పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ, యూనివర్శిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులేనన్నారు. పార్ట్ టైమ్ విధానంలో పనిచేసేవారు అనర్హులని గత ఆరేళ్లలో సెకండరీ స్థాయికి మించిన ఏ విద్యాసంస్థలో అయినా మూడేళ్లకు తగ్గకుండా పనిచేసిన ఉపాధ్యాయులు అర్హులుగా వెల్లడించారు. పాత ఓటు చెల్లుబాటు కాదని గతంలో ఓటు ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవలసిందిగా తెలియజేశారు.

# ఎన్నికల కోడ్ అమలు......

* రిజర్వేషన్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత
* ఎంపిడిఓ అమ్మిరాజు



**తాళ్లపూడి, పెన్ పవర్, అక్టోబర్ 15:**రాష్ట్రం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, కోడ్ లోని అంశాలు అమలు చేయని పక్షంలో ఎలక్షన్ కమిషన్ చర్యలుకు భాద్యులు అవుతారని తాళ్లపూడి ఎంపీడీఓ, బి.అమ్మి రాజు పేర్కొన్నారు. రాజకీయ నాయకుల ఫోటోలు, ఫ్లెక్సీ లు తొలగించాలని, విగ్రహాలు కనబడకుండా మూసి వేయాలని, గోడలపై ఎన్నికలకు సంభందించిన రాతలు తొలగించాలని, వీటిపై తమ ప్రభుత్వ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఈ కోడ్ అమలు అవుతుందన్నారు.

**పంచాయతీ వార్డుల విభజన**

నవంబర్ నెలలో మొదటి విడతలో జరిగే సర్పంచి ఎన్నికలకు సంభందించి సర్పంచ్ రిజర్వేషన్, వార్డుల రిజర్వేషన్ అధికారికంగా ప్రకటితం చేసారు. తాళ్లపూడి మండలం లో 11 గ్రామాలు ఉండగా, వాటిలో తిరుగుడు మెట్ట ఎస్సీ మహిళకు, ప్రక్కిలంక, పోచవరం ఎస్సీలకు, మలకపల్లి జనరల్, బల్లిపాడు ఎస్సీ మహిళ, అన్నదేవరపేట బి.సికి, వేగేశ్వరపురం, తాడిపూడి, గజ్జరం జనరల్ మహిళకు, తాళ్లపూడి, పెద్దేవం జనరల్ కి కేటాయించారు. కాగా మండలంలో 134 వార్డులకు రిజర్వేషన్ నిర్ణయించారు.

**అనుమానాలుంటే నేరుగా అడగవచ్చు-ఎంపీడీఓ**

తాళ్లపూడి మండలంలో ఎంపిటిసి, సర్పంచి స్థానాలు ఎంపిక చేయటంలో కొన్ని వర్గాలకు అన్యాయం జరిగిందంటూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తాళ్లపూడి ఎంపీడీఓ అమ్మిరాజు మాట్లాడుతూ రిజర్వేషన్ ప్రక్రియ శాస్త్రీయంగా, పారదర్శకంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్ణయించామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులకు ఎవరికైనా అనుమానం ఉంటే తనను నేరుగా కలిస్తే వివరిస్తామని ఆయన వెల్లడించారు. బయట వచ్చిన ఊహాగానాలకు తెరవేయాలని, ఉన్నతాధికారుల అనుమతితో రిజర్వేషన్ వెల్లడించామన్నారు.

# కొవ్వూరు మున్సిపల్ ఎన్నికల సిబ్బందికి సమగ్ర శిక్షణ -- ఆర్డీఓ కె.ఆనందరావు



**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 15:**కొవ్వూరు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు నియమితులైన ఎన్నికల అధికారులు(ఈఓలు), అదనపు ఎన్నికల అధికారులు(అదనపు ఈఓలు), సహాయ ఎన్నికల అధికారు(ఏఈఓలు) లకు కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొవ్వూరు ఆర్డీఓ కె.ఆనందరావు హాజరై, ఎన్నికల విధుల నిర్వహణపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, అధికారుల విధులు, బాధ్యతలు, పోలింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలపై శిక్షణలో వివరించారు. ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, సమన్వయంతో నిర్వహించాలని ఆర్డీఓ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు కొవ్వూరు మున్సిపాలిటీకి చెందిన పీవీవీ సాంబశివరావు, నిడదవోలు మున్సిపాలిటీకి చెందిన జి.ముత్తయ్య శిక్షణ అందించారు. కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ గాంధీ సందీప్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నగరంలో రూ.7.60 కోట్లతో అభివృద్ధి పనులు

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన




**రాజమహేంద్రవరం పెన్ పవర్, అక్టోబర్ 15:**నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. మొత్తం రూ.7.60 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. కోటి లింగాల ఘాట్ సమీపంలోని 10 ఎంఎల్డి ప్లాంట్ వద్ద రూ.1.30 కోట్లతో ఎస్కలేటర్ ఏర్పాటు, రూ.4 కోట్లతో యుటిలిటీ వాటర్ సప్లై పనులకు ఎమ్మెల్యే వాసు శంకుస్థాపన చేశారు. పుష్కరాల పనుల్లో భాగంగా క్వారీ సెంటర్ వద్ద రూ.27 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. క్వారీ జంక్షన్ నుంచి శానిటోరియం, ఎయిర్‌పోర్ట్ రోడ్డు పరిధిలోనూ, జె ఎన్ రోడ్డు రామాలయం జంక్షన్ వద్ద కూడా పుష్కరాల విద్యుత్ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రామాలయం జంక్షన్ వద్ద రూ.1.50 కోట్లతో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నగరంలోని ఒకటో వార్డు బాబానగర్‌లో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, రోడ్డుకు డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులన్నింటినీ , వచ్చే రెండు మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. కూటమి నాయకులు కూడా అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యకమాల్లో కూటమి నాయకులు, ఆయా డివిజన్ల ఇంచార్జ్ లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జీలుగుమిల్లి మండలంలో రిజర్వేషన్లు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 15;** ఏజెన్సీ మండలం అయిన జీలుగుమిల్లి మండలంలోని జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీల రిజర్వేషన్లను ఎంపీడీవో కే వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జడ్పిటిసి, ఎంపీపీ స్థానాలకు( ఎస్టీ మహిళ) కరారు చేశారు. మండలంలోని 9 ఎంపీటీసీ స్థానాలకు గాను జీలుగుమిల్లి ,అంకన్నగూడెం( జనరల్ )తాటి యాకులగూడెం, రాచన్న గూడెం( జనరల్ మహిళ) దర్భ గూడెం, కామయ్య పాలెం, వంకావారిగూడెం (ఎస్టి) ములగలంపల్లి, పి అంకంపాలెం( ఎస్టి మహిళ) ఖరారు చేసినట్లు ఆమె తెలిపారు.

# పోలవరం జిల్లాలో పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు!



* 186 సర్పంచ్.. 1,734 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు
* జిల్లా అసాధారణ గెజిట్‌లో అధికారికంగా వివరాల వెల్లడి
* వార్డు స్థానాల్లో ఎస్టీలకు 1,383.. అన్‌రిజర్వుడ్‌కు 351 స్థానాలు
* రిజర్వేషన్ల వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 15:**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలవరం జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మరో కీలక అడుగు పడింది. జిల్లాలోని 186 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలతో పాటు 1,734 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఖరారు చేసిన రిజర్వేషన్ల వివరాలను జిల్లా అసాధారణ గెజిట్‌లో ప్రచురించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం--1994, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఈ నెల 12న జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 154 ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ మేరకు అక్టోబర్ 15న జిల్లా అసాధారణ గెజిట్‌లో రిజర్వేషన్ల వివరాలను అధికారికంగా ప్రచురించినట్లు పేర్కొన్నారు.

**సర్పంచ్ స్థానాల్లో మహిళలకు 90**

జిల్లాలోని మొత్తం 186 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అందించిన ప్రకటన ప్రకారం ఈ స్థానాలన్నింటినీ షెడ్యూల్డ్ తెగలకు కేటాయించగా, వాటిలో మహిళలకు 90, జనరల్ విభాగానికి 96 స్థానాలు కేటాయించినట్లు పేర్కొన్నారు.

**వార్డు సభ్యుల స్థానాల్లో ఎస్టీలకు పెద్దపీట**

జిల్లావ్యాప్తంగా 186 గ్రామ పంచాయతీల పరిధిలోని 1,734 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వీటిలో షెడ్యూల్డ్ తెగలకు 1,383 స్థానాలు కేటాయించగా, ఎస్టీ మహిళలకు 659, ఎస్టీ జనరల్ విభాగానికి 724 స్థానాలు కేటాయించారు.అన్‌రిజర్వుడ్ విభాగానికి 351 స్థానాలు కేటాయించగా, వాటిలో మహిళలకు 142, జనరల్ విభాగానికి 209 స్థానాలు కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు.

**గెజిట్‌లో రిజర్వేషన్ల పూర్తి వివరాలు**

సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఆయా సబ్ కలెక్టర్లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీల వారీగా, సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్ల వివరాలను జిల్లా అసాధారణ గెజిట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తికావడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నాహాల్లో మరో కీలక దశ పూర్తయినట్లయింది.

# శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గ అమ్మవారు



**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 15:**తాళ్ళపూడిలోని ప్రసిద్ధ శ్రీ నవదుర్గాది పరివార శ్రీ చక్ర సహిత శ్రీ కనకదుర్గ అమ్మవార్ల దేవాలయంలో 25వ దసరా మహోత్సవాలు అత్యంత ఘనంగా, వైభవంగా జరుగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నాడు శ్రీ కనకదుర్గ అమ్మవారు భక్తులకు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మహోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే క్యూ లైన్లలో వేచి ఉండి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. లలితా దేవి రూపంలో శోభాయమానంగా ప్రకాశిస్తున్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నీలి సూర్యనారాయణ, నీలి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రజతోత్సవ(25వ) దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. భక్తులందరూ ఈ నవరాత్రి ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని, పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అలాగే, జగన్మాత కృపాకటాక్షాలకు, అమ్మవారి ఆశీస్సులకు పాత్రులు కావాలని వారు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




* తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బుడ్డిగ సతీష్ గౌడ్ సేవా కార్యక్రమం
* పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గ్రామీణ ప్రజలు.. ఉచితంగా వైద్య పరీక్షలు
* సతీష్ గౌడ్‌ను ఘనంగా సన్మానించిన ఎంఆర్పీఎస్ నాయకులు

**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 15:**సేవా దృక్పథంతో చేపట్టిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పోలవరం జిల్లా గంగవరం మండలం నెల్లిపూడి గ్రామంలో సి ఆర్ ఎల్ టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు బుడ్డిగ సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. తన తల్లిదండ్రులు కీర్తిశేషులు బుడ్డిగ చిరంజీవిరావు, లక్ష్మీతులసి జ్ఞాపకార్థం సతీష్ గౌడ్ ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలోని గౌతమీ నేత్రాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి వైద్య శిబిరం, రమా దంత వైద్యశాల ఆధ్వర్యంలో ప్రత్యేక దంత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ ఆసుపత్రులకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సలహాలు అందించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒకేచోట వివిధ రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

**తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయం**

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన బుడ్డిగ సతీష్ గౌడ్ సేవా దృక్పథాన్ని పలువురు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు పేర్కొన్నారు.వైద్య శిబిరం అనంతరం నెల్లిపూడిలో ఎంఆర్పీఎస్ నాయకులు, పలువురు స్థానిక నాయకులు బుడ్డిగ సతీష్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ప్రజాసేవలో భాగంగా ఆయన చేపట్టిన కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, రాంబాబు, బుడ్డిగ సతీష్ గౌడ్ కుటుంబ సభ్యులు, ఎంఆర్పీఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com